క్లుప్తంగా

కులగణన పూర్తి చేయండి

తంబళ్లపల్లె: మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన కులగణన సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం పరసతోపు పంచాయతీలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కులగణన సర్వే యాప్‌లో సమాచారాన్ని సమగ్రంగా పొందుపరచాలన్నారు.

పౌర హక్కులపై అవగాహన

కురబలకోట: పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ బి. దస్తగిరి, తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని ఎర్రమద్దివారి పల్లె కాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు కుల, మత బేధాలు లేకుండా సంతోషంగా జీవించాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావచ్చన్నారు. సత్వరం పరిష్కరించడం జరుగుతుందన్నారు. హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలన్నారు.

గడ్డివాములు దగ్ధం

పెద్దమండ్యం: మండలంలోని వెలిగల్లులో మంగళవారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మోపూరి రమణయ్య పాడి ఆవుల పోషణతో జీవనం సాగిస్తున్నారు. తన పొలం వద్ద వరిగడ్డిని రెండు వాములుగా వేసి ఉంచాడు. గడ్డివాముల వద్ద మంటలు రావడం చూసి ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు చెలరేగడంతో వాములు రెండు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ. 60 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లె సిటీ: సారా విక్రయిస్తున్న ఇద్దరిని మదనపల్లె వన్ టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఏఎస్ఐ ఆదినారాయణ కథనం మేరకు...పట్టణంలోని బుగ్గకాల్వకు చెందిన బాలాజీనాయక్, సరసమ్మలు వేర్వేరు ప్రాంతాల్లో సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 18 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె : కమర్షియల్ జోన్‌లో నడపాల్సిన ప్రైవేట్ ఆస్పత్రులు మదనపల్లెలో రెసిడెన్షియల్ ఏరియాలో నిర్వహిస్తుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన్ యువసేన అధ్యక్షులు పునీత్ ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన పునీత్...పట్టణంలో ప్రైవేట్ హాస్పిటల్స్ అక్రమనిర్మాణాలపై ఫిర్యాదు చేశారు.

21 బాక్సుల మద్యం పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతి కోట క్రాస్ వద్ద ఎస్ఐ రవీంద్రబాబు సోమవారం రాత్రి సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా అందులో 21 బాక్సుల మద్యం ఉన్నట్లు గుర్తించారు. మద్యం తీసుకువస్తున్న ములకలచెరువు మండలానికి చెందిన షేక్ షౌకత్, అహమ్మద్ సాహెబ్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆణిముత్యాలాంటి అక్షరాలతో మంచి మార్కులు

రాయచోటి టౌన్ : అక్షరాలు ఆణిముత్యాలాంటి అక్షరాలే మంచి మార్కులకు మార్గాలని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ బాబు అన్నారు. మంగళవారం డైట్ కేంద్రంలో త్వరలో జరగబోయే పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు చేతిరాతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేతిరాత స్పెషలిస్టు రెడ్డెన్న ద్వారా అవగాహన కల్పించారు. పరీక్షలలో అక్షరాలు ఆణిముత్యాల్లా కనిపిస్తే మంచి సమాధానాలు క్షుణ్ణంగా కనిపిస్తాయని దీంతో మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

అక్రమ వాహనాలను అడ్డుకున్న ఆర్టీసీ అధికారులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె-పెద్దమండ్యం రోడ్డులో అక్రమ వాహనాలను మదనపల్లె ఆర్టీసీ-1 డిపో అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ మార్గంలో ఆటోలు, జీపులు అధికంగా నడుస్తుండటంతో స్థానిక పోలీసుల సహాయంతో ఆటో డ్రైవర్లు, జీపు డ్రైవర్లతో మాట్లాడారు. పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోరాదని, నిబంధనలకు విరుద్ధంగా నడపరాదని తెలిపారు. మదనపల్లె వన్ డిపో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

రామసముద్రం: ప్రభుత్వం పేదల ఆరోగ్యం దృష్ట్యా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కుసుమకుమారి తెలిపారు. మంగళవారం మూగవాడి గ్రామ సర్పంచ్ రత్నమ్మ అధ్యక్షతన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న సురక్ష పేరుతో పేదలకు అన్ని ఆరోగ్య సమస్యలకు ఉచితంగా వైద్యం అందించడం జరుగుతోందన్నారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి, ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని అవసరమైన మేరకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లీలా, ఎంపీడీవో నారాయణస్వామి, డీటీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, రాధారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు , వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.5 కోట్లతో మున్సిపాలిటీకి కొత్త భవనాలు

- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆమోదం
- రూ.3 కోట్లతో 33 కే.వీ. ఎలక్ట్రికల్ లైను మార్పు
- ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన కౌన్సిలర్లు



ప్రజాసమస్యలను చైర్‌పర్సన్ మనూజారెడ్డికి వివరిస్తున్న వైస్‌చైర్మన్ జింకాచలపతి

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీకి నూతన కార్యాలయ భవనం సమకూరనుంది. రూ.5 కోట్లతో నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా మంజూరు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో...మంగళవారం జరిగిన మున్సిపల్ సమావేశంలో సభ్యులందరూ ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ... పేదవాడి ఆరోగ్యానికి అండగా నిలిచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కౌన్సిలర్లు ఈ విషయాన్ని తమ తమ వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లు సహకరించి, ప్రజాసమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషిచేయాల్సిందిగా కోరారు. అనంతరం సమావేశంలో ఎజెండాలోని అంశాలపై చర్చించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ..పారిశుధ్య కార్మికులు మస్టర్ పాయింట్లలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయమై పలుమార్లు కౌన్సిల్‌లో చర్చించడం జరిగిందన్నారు. ప్రస్తుత సమావేశంలో వారి ఇబ్బందులు తీర్చేలా, ఆరు పాయింట్లలో వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. గతంలో మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాల పేరుతో దోపిడీ జరిగేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రూ.12,500 ఉన్న వారి వేతనం జగనన్న ప్రభుత్వంలో రూ.21,000కు పెంచడమే కాకుండా, పలు నిబంధనలను సరళతరం చేశారన్నారు. అజెండాలోని అంశాలన్నింటికీ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పట్టణంలోని రామారావుకాలనీ, శివాజీనగర్, పీవర్స్‌కాలనీ, సీటీఎం రోడ్డు బాలాజీనగర్, విజయనగర్ కాలనీలో 33 కే.వి.విద్యుత్‌లైన్లు ఇండ్లమీద వెళుతూ, చాలా అపాయకరంగా ఉండటమే కాకుండా పలువురు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ విషయమై ప్రజల అభ్యర్థనమేరకు ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశించడంతో రూ. 3కోట్ల వ్యయంతో ఎలక్ట్రికల్ లైను మార్పుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీనిపై కౌన్సిల్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో వారి ఇబ్బందులు తీరుస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్ ప్రసాద్‌బాబు, బి.ఏ.ఖాజా, మేస్త్రీశ్రీనివాసులు, రహీం, బాలగంగాధరరెడ్డి, గుండ్లూరురఫీ తదితరులు ఎంపీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కర్పూరి ఠాకూర్‌కు ఘన నివాళి



కర్పూరి ఠాకూర్ నివాళి సభలో పాల్గొన్న నాయీబ్రాహ్మణ సంఘం, బీజేపీ నాయకులు

మదనపల్లె : బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు బీజేపీ ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం తమ జాతివారందరికీ గర్వకారణమని నాయీ బ్రాహ్మణసంఘం అధ్యక్షులు మణి తెలిపారు. స్థానిక అమ్మచెరువుమిట్టలోని నాయీ బ్రాహ్మణసంఘం కమ్యూనిటీ భవనంలో కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయీబ్రాహ్మణులకు సముచిత గౌరవం కల్పిస్తూ, కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న అవార్డు ప్రకటించడంపై ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, బర్నేపల్లె రవికుమార్, డాక్టర్ అజ్మతుల్లాఖాన్, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు శంకర్, పి.సదాశివ, కృష్ణమూర్తి, గంగాధర, మంజునాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రామసముద్రం: మండల ప్రాంతంలోని కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులలో మంగళవారం ఎస్ఐ చంద్రశేఖర్ ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నాటక నుంచి అక్రమంగా వస్తున్న మద్యం, నగదు, వివిధ రకాల వస్తువులపై తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాల్లో ఎలాంటి అక్రమమైన సరుకు రాకుండా గుట్టపాళ్యెం, ఏ.కొత్తూరు, ఆల్పేపల్లి, పురాండ్లపల్లి చెక్‌పోస్టులలో తనిఖీ నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న లక్ష్మీదేవిరామకృష్ణ

పీలేరు : వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టకు చెందిన తాటిపత్రి లక్ష్మీదేవి రామకృష్ణను వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలుగా నియమించారు. మంగళవారం ఆమె తిరుపతిలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడానికి కృషి చేయాలని సూచించారు.

దళిత గ్రామాల అభివృద్ధికి కృషి



అధికారులకు సమస్యలు విన్నవిస్తున్న దళిత సంఘాల నాయకులు

పీలేరు : దళిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. మంగళవారం మండలంలోని అగ్రహారం పంచాయతీ ఆరెంవారిపల్లె ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. దళిత నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఏడుగురు హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా పట్టాలు, బిల్లులు మంజూరు చేయలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. గ్రామంలో విద్యుత్ వీధి దీపాలు లేకపోవడంతో చీకటిలో కాలం వెలదీస్తున్నారని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నీటి సమస్య ఎక్కువగా ఉందని, కొత్తగా బోరు, ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. వీధుల్లో రోడ్లు సగం వరకే ఉన్నాయని, పూర్తిగా వేయాలని తెలిపారు. స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఎస్టీ కాలనీకి ఎలాంటి గుర్తింపు లేదని, చెంచులక్ష్మీ కాలనీగా నామకరణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ రమణ, ఏపీవో మహేశ్వర్, ఏవో రమాదేవి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, దళిత నాయకులు పాలకుంట శ్రీనివాసులు, మల్లికార్జున, గండికోట వెంకటేష్, సురేంద్ర, ఆనంద, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సిద్ధం మహా సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేసి మరోమారు పార్టీ గెలుపు కోసం పనిచేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురంలో ఫిబ్రవరి 11న జరగనున్న సిద్ధం ఎన్నికల మహాసభ జనసంద్రాన్ని తలపించేలా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు. మంగళవారం వాల్మీకిపురంలో జరిగిన పీలేరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతిధులు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధం మహాసభకు పీలేరు నియోజవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో ఉప్పెనలా కదలి రావాలన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అనంతపురం సిద్ధం సభకు కార్యకర్తలను తరలించడానికి దిశా నిర్దేశం చేయడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని భీమిలి సభ కంటే విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సామాజిక న్యాయాన్ని ప్రభుత్వ విధానంగా పరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవి శ్రీనాథరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, జమీర్ అలీఖాన్, శివానంద రెడ్డి, ముక్తియార్, జమీర్ అలీ, రవి, హుమయూన్, వెంకటరమణ, గజ్జల శీన్‌రెడ్డి, ఆనంద, బాబు రెడ్డి, షావత్, అప్పుల, నరసింహులు, రత్నశేఖర్ రెడ్డి, రఫి, కలీమ్, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, రమేష్ రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీదేవి, పద్మజ, నూర్‌జహాన్, జగన్మోహన్‌రెడ్డి, రవినాయక్, రాయుడు, వెంకట్రమణ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సిద్ధాంతం అనుసరణీయం

పెద్దతిప్పసముద్రం: జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు అనుసరణీయమని ఎంపీపీ మహమూద్, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి అన్నారు. మహాత్ముడి వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతిపిత చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యం చంద్ర, భాస్కర్‌నాయుడు, మల్లెం శివయ్య, సాదిక్, శివారెడ్డి, గిరీశ్వామి, అయూబ్, ఉత్తన్న, మహబూబ్‌బాషా, రాజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ వర్ధంతి

పీలేరు రూరల్ : మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య సంఘం, వాసవిక్లబ్, వాసవికపుల్స్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ శాంతి మార్గంలో దేశానికి స్వాతంత్రం సాధించారని పేర్కొన్నారు. గాంధీ చూపిన అహింస, శాంతి మార్గాల్లో ప్రజలు నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూనా సత్యం, మల్లికార్జునశెట్టి సుధీర్, సురేష్, అరవింద్ బాబు, శివఫణీష్, మహిదర్, నాగరాజు, తులసీకృష్ణ, ఉమామహేష్, శంకర్‌నాథ్ పాల్గొన్నారు.

గాంధీకి నివాళులు

మదనపల్లె సిటీ: మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.గాంధీ బాటలో నడవాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ కృష్ణమూర్తి అన్నారు.కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.

అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీలలో జ్ఞానాంబిక విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం కాలేజీలో క్రీడాకారులను అభినందించారు. 100 మీటర్ల పరుగు పందెంలో రుచిత బంగారు పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించినట్లు కాలేజీ కరస్పాండెంట్ గురుప్రసాద్ తెలిపారు. రిలే పరుగు పందెంలో రుచిత, మానస, సుజిత, కీర్తన కలిసి రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. జావలిన్‌త్రో పోటీల్లో సుమంత్ రజత పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో పద్మ రజత పతకం సాధించిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో బాలిక విభాగంలో రామారావు కాలనీ, ఎస్‌బీఐ కాలనీ సచివాలయం తరపున పాల్గొని కబడ్డీ, క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచాయన్నారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

మదనపల్లె : గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య నూతన క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్లు జింకాచలపతి, నూర్‌ఆజం, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజాసమస్యలు తీర్చేందుకు నిత్యం కృషి చేస్తున్నారన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కేలండర్ ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సింధలూరి రజని, బి.ఏ.ఖాజా, మేస్త్రీశ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుడినాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు సీపీ.వినోద్‌కుమార్, నాయకులు విజయకుమార్‌రెడ్డి, నందిని, అభిషేక్, సతీష్, ఆనంద, హరి, రవినాయక్, రవి, శ్రీకాంత్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బి.కొత్తకోట: క్రీడాకారులు క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఎక్కడ పోటీలు నిర్వహించినా పాల్గొనాలని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో విజేతలకు మంగళవారం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ట్రోఫీలను అందజేశారు. బాడ్మింటన్ విజేత సైపుల్లాకు మొదటి బహుమతి, మహిళా విభాగంలో ఆరేబినాకు, ఖోఖో విజేత పి.దివ్య, పురుష విభాగంలో సందీప్, కార్తిక్, వాలీబాల్ విజేత రంజనీలకు ట్రోఫీ, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి అందరూ సహకరించారని అన్నారు. మేనేజర్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేష్

పీలేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శిగా కలికిరి మండలం అద్దవారిపల్లెకు చెందిన మలతోటి నరేష్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన వాల్మీకిపురం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసి పదవులకు వన్నె తేవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దెల రవీంద్ర, సుధాకర్, పలవలి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నిస్సార్ అహ్మద్

మదనపల్లె సిటీ: స్థానిక నిమ్మనపల్లెరోడ్డులోని శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామిని మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం గుప్తా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వాదాలు అందజేశారు.

భయాందోళనలు విడనాడాలి

పెద్దతిప్పసముద్రం: పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు ప్రధానంగా భయాందోళనలు విడనాలని జిల్లా బాలికా శిశు అభివృద్ధి అధికారి (జీసీడీవో) రాధ సూచించారు. మంగళవారం ఆమె స్థానిక మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరా తీసారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలపై శ్రద్ధ వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించినట్లు ఎంఈఓ గొస్‌పీర్, ప్రిన్సిపాల్ శివకుమారి పేర్కొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

మదనపల్లె : డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు పాటించాలని మదనపల్లె ఎంవీఐ శివలింగయ్య అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో డ్రైవర్లకు అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ట్రాఫిక్ సీఐ కృష్ణయ్య, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవీఐ శివలింగయ్య మాట్లాడుతూ...వాహనదారులు అప్రమత్తతతో వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. పరిమిత వేగంతో వాహనాలు నడపాలన్నారు.

కరోనా మృతులకు నివాళులు



నివాళులు అర్పిస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ: కరోనా మహమ్మారితో మృతి చెందిన వైద్య సిబ్బందికి ఆత్మ శాంతి కలగాలని కోరుతూ మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించారు. కరోనా సమయంలో విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది మృతి చెందారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి తెలిపారు. వారి సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జమున, ఆర్‌ఎంఓ ప్రసాద్‌రాజు,వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోవిడ్ అమరవీరుల కృషి సంస్మరణీయం

పీలేరు రూరల్ : కోవిడ్ అమరవీరుల కృషి సంస్మరణీయమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పీలేరు బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఐఎంఏ కోవిడ్ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ వ్యతిరేక పోరాటంలో తమ యూనియన్‌లో దేశవ్యాప్తంగా 124 మందిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరసురేంద్ర, డాక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.